ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కర్ణాటక వార్తలు

గురువారం 17 ఏప్రిల్ 2025

రాష్ట్రపతి వద్దకు ముస్లిం రిజర్వేషన్ బిల్లు

బెంగళూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉభయసభల్లో ఇటీవల ఆమోదం పొందిన ప్రభుత్వ పనుల్లో ముస్లింలకు 4శాతం రిజర్వేషన్ బిల్లును గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ బుధవారం రాష్ట్రపతికి పంపారు. ఈ బిల్లును అంగీకరించరాదంటూ ప్రతిపక్ష బీజేపీ ఇప్పటికే గవర్నర్‌ను కోరిన సంగతి తెలిసిందే. మతం ఆధారంగా ప్రభుత్వ పనుల్లో రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగంలో అవకాశం లేదని బీజేపీ నిరసనలు చేపట్టింది. కాంగ్రెస్ ద్వేష రాజకీయాలకోసం ఇలా వ్యవహరిస్తోందని బీజేపీ మండిపడుతోంది.

ఏకాభిప్రాయం సాధ్యమేనా..?

- నేడు కేబినెట్ సమావేశం
- కులగణన ఆమోదంపైనే అందరి చూపు
- మంత్రులు ఏకతాటిపైకి వచ్చేరా?
- సీఎం సిద్దరామయ్యకు పెను సవాలే..





బెంగళూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ కమిషన్ విద్య, సామాజిక, ఆర్థిక రంగాల్లో ప్రగతిపై పదేళ్ల క్రిందట జరిగిన కులగణన సర్వే నివేదికపై సర్కారు నిర్ణయం సర్వత్రా కుతూహలం అవుతోంది. సరిగ్గా ఆరు రోజులక్రిందట కేబినెట్‌లో కులగణన నివేదికను స్వీకరించారు. ఆ రోజు నుంచే రాష్ట్ర రాజకీయాల్లో రోజుకో సంచలనం అనేలా వార్తలు వస్తూనే ఉన్నాయి. వారం రోజుల అధ్యయనం కోసం మంత్రులకు నివేదికలు ఇచ్చారు. గురువారం మంత్రివర్గం తీసుకునే నిర్ణయం కీలకం కానుంది. ఇది రాష్ట్రప్రభుత్వంపైనే కాకుండా రాజకీయాలపైనా పార్టీ ప్రముఖులపైనా పెను ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి. మంత్రుల్లో సమష్టి నిర్ణయం సాధ్యమా అనేది ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం మంత్రుల్లో అనుకూలం, వ్యతిరేకం, తటస్థం అనే మూడు గ్రూపులుగా ఉన్నారు. వీరందరినీ ఏకాభిప్రాయానికి సీఎం సిద్దరామయ్య తీసుకొస్తారా..? అనేది కుతూహలంగా మారింది. కేబినెట్‌లో కీలక నిర్ణయంగానీ, ఏకపక్ష నిర్ణయంగానీ సాధ్యం కాని పరిస్థితి నెలకొంది. మంత్రులు ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా కులగణన నివేదికకు మద్దతు ఇస్తే వారి కులాల్లో లావా చెలరేగినట్టు అవుతుంది. రాష్ట్రంలో అగ్రకులాలైన ఒక్కలిగ, లింగాయత, బ్రాహ్మణ సమాజానికి చెందినవారు కులగణనతో అన్యాయం జరిగిందని, ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించరాదని ఒక నిర్ణయానికి వచ్చారు. ఇప్పటికే ఒక్కలిగ సంఘం సర్కారుకు అల్టిమేటం జారీ చేసింది. రాష్ట్ర బంద్ చేపడ్తామని హెచ్చరించింది. ఇటువంటి క్లిష్ట సమయంలో అధిష్టానం నిర్ణయం తీసుకోవాలని భావించినా అగ్రనేతలు రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ నేషనల్ హెరాల్డ్ కేసులో పీకల్లోతు కష్టాల్లో ఇరుక్కుపోయారు. ఇక భూదందా విషయంలో ప్రియాంకగాంధీ భర్త రాబర్ట్ వాద్రా రోజూ విచారణకు హాజరవుతున్నారు. ఇలా అగ్రనేతలు ముగ్గురూ కేసుల్లో ఉండడంతో రాష్ట్రానికి సంబంధించిన విషయంలో జోక్యం చేసుకునే పరిస్థితి లేదని పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. మంత్రులు కూడా దాటవేసి సేఫ్‌జోన్‌కు చేరాలని ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఒక్కలిగ, లింగాయత సమాజానికి చెందిన సంఘాలు, మఠాధిపతులు, స్వామీజీలు ప్రభుత్వంపై తీవ్రఆగ్రహంతో ఉన్నారు. వారిని కాదనుకుని మంత్రులు కూడా ముందుకెళ్లే పరిస్థితి ఉండదని చెప్పవచ్చు.

బహిర్గతమైన గణాంకాలు

కులగణన నివేదిక రహస్యంగానే ఉంది. గణాంకాలు మాత్రం బహిరంగమయ్యాయి. వ్యతిరేకం, అనుకూలం అనేలా గ్రూపులు ఏర్పడ్డంతో కేవలం మంత్రులు మాత్రమే కాకుండా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. గణాంకాలు తప్పుగా ఉన్నాయని పలువురు స్వామీజీలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. డీసీఎం డీకే శివకుమార్ మంగళవారం రాత్రి ఒక్కలిగ సమాజానికి చెందిన ఎమ్మెల్యేలు, మంత్రులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఒక్కలిగ జనాభా పొందుపరచడంలో తప్పుగా ఉందని ఎమ్మెల్యేలు అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. బుధవారం లింగాయత నాయకులు పార్టీలకు అతీతంగా సభకు ఆహ్వానించారు. అఖిల భారత వీరశైవమహాసభ కూడా సమష్టి నిర్ణయం తీసుకునేందుకు సభ జరపాలని నిర్ణయించింది. కులగణన నివేదికను వ్యతిరేకించేలా బ్రాహ్మణ, విశ్వకర్మ సమాజానికి చెందిన ముఖ్యులు, స్వామీజీలు మండిపడుతున్నారు. మరోవైపు మాజీ మంత్రి రేవణ్ణ నేతృత్వంలో బీసీ వర్గాల ప్రముఖులతో సభ ఏర్పాటు చేశారు.



ప్రత్యేక శాసనసభ సమావేశాలకై ఆలోచన

కులగణన నివేదిక అంశంలో కేవలం ప్రభుత్వ నిర్ణయం తీసుకుంటే ఎక్కడికైనా దారి తీయవచ్చునని, అది కాంగ్రెస్ పార్టీ ప్రగతిపైనా ప్రభావం చూపుతుందని భావిస్తున్న సీఎం, కీలక మంత్రులు ప్రత్యేక శాసనసభ సమావేశాలు జరిపేలా ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు కులగణన నివేదికపై అధ్యయనానికి మంత్రివర్గ సబ్‌కమిటీ ఏర్పాటు చేయాలని తీర్మానించారు. నివేదిక వాస్తవ పరిస్థితులు, సాధకబాధకాల అధ్యయనానికి నిపుణుల కమిటీ ఏర్పాటు చేయదలిచారు. లేనిపక్షంలో శాస్త్రీయ ప్రమాణాలతో కొత్తగా సర్వే జరపాలనే ఆలోచనలోనూ ఉన్నట్టు తెలుస్తోంది.



● రిజర్వేషన్ జాబితాకు కొత్త కులాలు

కులగణన నివేదిక సమగ్రంగా బహిరంగం కాకపోయినా అంతా ఓపెన్ అనేలా మారిపోయింది. పలు చిన్నకులాలు రిజర్వేషన్‌ల జాబితాకు చేరడంతోపాటు కొన్ని కులాల పేర్లను మార్పు చేసినట్టు తెలుస్తోంది. 2ఏ కేటగిరీలో ఉప్పార కులానికి ఉపకులమైన పడతి పేరిట ఉండే వారిని పదార్థిగా 2020లో ప్రభుత్వం మార్పు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. అయితే దక్షిణకన్నడ జిల్లాలో పురోహితులను పదార్థి పేరిట పిలిచే సంప్రదాయం ఉంది. పదార్థి కులాన్ని ఉప్పార కులంలో పరిగణించలేదు. ఈ కులాన్ని కేటగిరీలో 1లో చేర్చాలని ఎన్ శంకరప్ప నివేదిక సిఫారసు చేసింది. ప్రస్తుతం కులగణన ద్వారా 2ఏలో చేర్చారు. పొమ్మల కులానికి చెందిన వారిని 1బీలో చేర్చారు. మరుత్తవర్ కులానికి ప్రత్యేకమైన సంఖ్య లేనందున 2ఏలో చేర్చాలని ప్రతిపాదనలు ఉన్నాయి. అయితే కేటగిరీ 1బీలో మరుత్తవర్‌ను చేర్చారు. దేవగాణిగ, ఒంటెత్తుగాణిగ, వాణియన్, జ్యోతిబణ, శివజ్యోతి పణగాణిగ, పాటాళి, అరేరా కులాలను 2ఏలో చేర్చారు. అలెమారి, అరె అలెమారి సంజారజాతులకు అనుబంధమైన కాడుగొల్ల, హట్టిగొల్ల, అడవిగొల్ల, ఖంజేరభాట్, ఖంజర్, ఖంజారభాట్, చప్పర్‌భన్, కుడచి కులాలను కేటగిరీ ఏలో చేర్చారు. గౌలి సముదాయాన్ని కేటగిరీ 1లో చేర్చారు. అనాథ శిశువులకు విద్య, ఉద్యోగంలో 1శాతం రిజర్వేషన్‌కు కులగణనలో ప్రస్తావించినట్టు సమాచారం.

మమ్మల్ని కాదని మనుగడ సాధించేరా..?

- వీరశైవ లింగాయత, ఒక్కలిగల మద్దతు అవసరం లేదా..?
- కాంగ్రెస్ సీనియర్ ఎమ్మెల్యే శ్యామనూరు ఆగ్రహం
- లింగాయతల్లో ఏడుగురు మంత్రులు వృథా: చన్నగిరి ఎమ్మెల్యే శివగంగ
- ఒక్కలిగ సమావేశంపై మంత్రి సంతోష్‌లాడ్ ఆగ్రహం



శ్యామనూరు శివశంకరప్ప

బెంగళూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వీరశైవ లింగాయత, ఒక్కలిగ కులస్థులను ఎదురించి ప్రభుత్వం మనుగడ సాధిస్తుందా అంటూ కాంగ్రెస్ సీనియర్ ఎమ్మెల్యే శ్యామనూరు శివశంకరప్ప సవాల్ విసిరారు. అఖిలభారత వీరశైవ లింగాయత మహాసభ జాతీయ అధ్యక్షుడిగానూ వ్యవహరిస్తున్న శ్యామనూరు శివశంకరప్ప బుధవారం మీడియాతో మాట్లాడుతూ కులగణనలో అన్యాయం జరిగితే ఒక్కలిగలతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. పదేళ్లక్రిందట జరిగిన కులగణన శాస్త్రీయంగా లేదన్నారు. కేబినెట్ భేటీలో ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూస్తామన్నారు. రాష్ట్రంలో లింగాయతులు, తర్వాత ఒక్కలిగలే అధికమన్నారు.

● శ్యామనూరు వ్యాఖ్యలపై సీఎం సిద్దరామయ్య కలబురగిలో స్పందించారు. ఎవరి అభిప్రాయాలు వారు వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇది సామాజిక, ఆర్థిక సర్వే అని, ఎవరికీ అన్యాయం జరగదని, అలా అన్యాయం జరిగేందుకు అవకాశం ఇచ్చేది లేదన్నారు. సభలో అన్ని అంశాలను చర్చిస్తామన్నారు.

● కాగా దావణగెరె జిల్లా చన్నగిరి కాంగ్రెస్ ఎమ్మెల్యే శివగంగ బసవరాజ్ మాట్లాడుతూ లింగాయత సమజానికి చెందిన ఏడుగురు మంత్రులు ఉన్నారని, ఎవరూ నోరు మెదపడం లేదని మండిపడ్డారు. ఎమ్మెల్యేలు చర్చించేందుకు సిద్ధమైన వారి నుంచి ఎటువంటి స్పందన లభించలేదన్నారు. ఏడుగురు అసమర్థ మంత్రులు వెంటనే రాజీనామా చేయాలన్నారు. మంత్రి ఈశ్వర్ ఖండ్రెకు ఫోన్ చేస్తే స్పందించలేదన్నారు.



ఎమ్మెల్యే శివగంగ

మంత్రి సంతోష్‌లాడ్ ఆగ్రహం

డీసీఎం డీకే శివకుమార్ ఒక్కలిగల సభ ఏర్పాటుపై మంత్రి సంతోష్‌లాడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం బెంగళూరులో మంత్రి లాడ్ మీడియాతో మాట్లాడుతూ కులగణన నివేదికను కేబినెట్ ద్వారా స్వీకరించామన్నారు. ప్రస్తుతం రాజకీయాల్లో కులసంఘర్షణ ఎక్కువయ్యిందన్నారు. మేమంతా ఒక్కటే అనేవారు కులానికి సంబంధించి హెచ్చుతక్కువలు వచ్చాయని వాదిస్తారన్నారు. గురువారం కేబినెట్‌లో చర్చకు రాకముందే ఇలా సొంత కులాల ఎమ్మెల్యేలతో సమావేశాలు జరపడం ఎంతవరకు సమంజసమన్నారు. డీసీఎం ఏర్పాటు చేసిన అత్యవసర సభ విషయంలో తనకు అసంతృప్తి ఉందన్నారు మంగళవారం. మధ్యాహ్నం కులగణన నివేదిక విషయంలో సంయమనం పాటించాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి హోదాలో ఆదేశించి, సాయంత్రం 6 గంటలకు ఒక్కలిగ ఎమ్మెల్యేలతో సమావేశం ఏర్పాటు ఎంతవరకు సమంజసమన్నారు. ప్రభుత్వ మనుగడలో అన్ని కులాల నాయకులు అవసరమేనన్నారు.



సంతోష్‌లాడ్

ఉపకులాలు కోకొల్లలు ..

- కురుబల్లో 11..
- లింగాయతుల్లో 95..

బెంగళూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దశాబ్దాలుగా లింగాయత, ఒక్కలిగ, కురుబ సామాజికవర్గాలు బలమైనవిగా ముద్రపడ్డాయి. ఆ కులాలకు చెందినవారే రాజకీయంగా, ఆర్థికంగా సమాజంలో శక్తివంతులయ్యారు. కులగణన తర్వాత మూడు ప్రధానమైన కులాలకు పలు ఉపకులాలు ఉన్నట్లు స్పష్టమైంది. ప్రధానంగా లింగాయతుల్లో 95 ఉపకులాలు ఉండగా వీటిలో 11 కులాలకు చెందిన వారు అత్యధిక జనాభా ఉన్నారు. ఒక్కలిగలో 47 ఉపకులాలు ఉండగా వీరిలోనూ 11 ఉపకులాలకు చెందినవారు ప్రాబల్యం ఉంది. కురుబ కులస్థులలో 11 ఉపకులాలు ఉండగా వీటిలో 4 కులాలకు చెందినవారి జనాభా ఎక్కువగా ఉంది. 2015 కులగణన సర్వే ప్రకారం కురుబ కులస్థులు 42,71,399 మంది కాగా ఉపకులాలలో 1,01,448 మంది ఉన్నారు. వీరితో కలిపి 43,72,847 మంది అవుతారు. వీరశైవలింగాయతలలో 10,49,706 మంది కాగా లింగాయత సమాజంలో 95 ఉపకులాలతో కలిపితే 66,35,233మంది అవుతారు. మొత్తం 76,84,939మంది ఉన్నారు. ఒక్కలిగలో 40,04,830మంది కాగా 47 ఉపకులాల ద్వారా 21,53,522 మందితో కలిపి 61,58,352 మంది ఉన్నారు.

లింగాయత కులంలో అత్యధిక ప్రాబల్యం కలిగినవి..

కులం పేరు	జనాభా				
బేడువజంగమ	89,868	వీరశైవ	1,01,019	గౌడ	4,60,555
లింగాయత వీరశైవ	2,22,395	నోళంబ	1,48,894	కమ్మ	1,11,739
వీరశైవపంచమశాలి	4,37,796	ఒక్కలిగ అనుబంధ కులాలు		రడ్డి	2,87,372
పంచమశాలి	6,33,506	గౌడ ఒక్కలిగ	1,84,479	నామదారి గౌడ	21,468
ఆదిబణిజగ	1,31,693	కుంచటిగ ఒక్కలిగ	41,188	కురుబకు అనుబంధ కులాలు	
కాడు ఒక్కలిగ	81,999	ఒక్కల్/ఒక్కలిగ	1,88,508	ధనగర్	26,435
లింగవంత	38,827	గంగటకార్/గంగడకార్	82,589	హాలుమత	21,540
లింగాయత	26,02,777	రెడ్డి ఒక్కలిగ	24,059	కురబ్	20,171
లింగాయత జంగమ	44,029	రెడ్డి	4,15,382	కురుబ్	21,279
		కుంచటిగ	1,95,499		

సజావుగా సీఈటీ

బెంగళూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): వృత్తి విద్యాకోర్సుల్లో ప్రవేశానికై నిర్వహించిన రాష్ట్రవ్యాప్తంగా కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (సీఈటీ) తొలిరోజు సజావుగా జరిగాయి. బుధవారం ఉదయం 10.30 గంటలనుంచి 11.50 దాకా ఫిజిక్స్ మధ్యాహ్నం 2.30 నుంచి 3.50 దాకా కెమిస్ట్రీ పరీక్షలు కొనసాగాయి. బెంగళూరు సహా 775 కేంద్రాల్లో పరీక్షలు సాగగా సీసీ కెమెరాల ద్వారా అధికారులు పర్యవేక్షించారు. జిల్లాస్థాయిలో జిల్లాధికారులు, సీఈఓలు పరిశీలించారు. గురువారం ఉదయం మ్యాథ్స్, మధ్యాహ్నం బయాలజీ పరీక్షలు జరగనున్నాయి. ఇంజనీరింగ్‌తోపాటు వివిధ వృత్తి విద్యాకోర్సులలో ప్రవేశానికి పరీక్షలు సాగాయి. పలు నిబంధనలకు అనుగుణంగా పరీక్షలు జరిపారు. విద్యార్థుల కోసం తల్లిదండ్రులు పరీక్షా కేంద్రాల వద్ద పడిగాపులు పడ్డారు.



పరీక్షా కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థులు



జేపీ నగర్ ఆక్స్‌ఫర్డ్ కళాశాల వద్ద తల్లిదండ్రులు, విద్యార్థులు

అవినీతికి కేరాఫ్ కాంగ్రెస్

- 11 ఏళ్లుగా దేశంలో స్వచ్ఛమైన పాలన
- బెళగావి జనాక్రోశ యాత్రలో విజయేంద్ర

బెంగళూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అవినీతికి కాంగ్రెస్ పార్టీ కేరాఫ్‌గా మారిందని దశాబ్దాల కాలంగా వారి నిర్వాకం అదేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర మండిపడ్డారు. బెళగావిలో బుధవారం జనాక్రోశ యాత్ర లో వేలాదిమంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయేంద్ర మాట్లాడుతూ కేంద్రంలో మన్మోహన్ సింగ్ పాలనలో 2జీ, కామన్వెల్త్ తోపాటు పలు అక్రమాలలో రూ.10 లక్షల కోట్లకుపైగా అవినీతి జరిగిందన్నారు. 65ఏళ్లపాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పేదలపట్ల సానుభూతి చూపలేదన్నారు. 11ఏళ్ల నరేంద్రమోదీ పాలనలో ఒక్క అవినీతి లేదని, మౌలిక సదుపాయాలలో ఆరున్నర దశాబ్దాల్లో సాధ్యం కానివి అమలయ్యాయన్నారు. నేషనల్ హెరాల్డ్ పత్రికను స్వాతంత్ర్యపోరాట నేతలు చందాలు వేసుకుని ప్రారంభిస్తే ఆ ట్రస్టు గాంధీ కుటుంబం సొంతం చేసుకుందన్నారు. ఆ తర్వాత యంగ్ ఇండియా సంస్థ గా మార్చుకుని రూ.50లక్షల పెట్టుబడితో సొంతం చేసుకున్నారన్నారు. ఇది రాహుల్‌బాబా అభివృద్ధి మోడల్ అంటూ వ్యంగ్యం చేశారు. ప్రతిపక్ష నేత అశోక్, ఛలవాది నారాయణస్వామి, ఎంపీలు జగదీశ్‌శెట్టర్, గోవింద కారజోళ, యదువీర్‌తోపాటు ఎమ్మెల్యేలు ముఖ్యనాయకులు పాల్గొన్నారు.



బెళగావి నిరసన ర్యాలీలో విజయేంద్ర, బీజేపీ నాయకులు



ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తలు, అభిమానులు

5 ఏళ్ల 5 నెలలు



- ఒకటో తరగతి ప్రవేశాలకు 6 ఏళ్ల నుంచి వెసులుబాటు
- ప్రాథమిక విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప

బెంగళూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఒకటో తరగతిలో ప్రవేశానికి ఆరేళ్ల వయస్సు పరిమితిలో వెసులుబాటు కల్పిస్తూ విద్యాశాఖ నిర్ణయించింది. బుధవారం నగరంలో ప్రాథమిక విద్యాశాఖ మంత్రి మధుబంగారప్ప మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర విద్యా పాలసీ కమిషన్ సిఫారసులకు అనుగుణంగా నిర్ణయం తీసుకున్నామన్నారు. ఐదేళ్లా ఐదు నెలలు నిండితే ఒకటో తరగతిలో ప్రవేశానికి అర్హత అన్నారు. గతంలో ఆరేళ్లు తప్పనిసరిగా ఉండేదన్నారు. 2022 ఆదేశాల ప్రకారం జూన్ 1నాటికి ఆరేళ్లు నిండినవారు మాత్రమే పాఠశాలలో చేరేందుకు అర్హులయ్యేవారు. ఇలా ఏటా వేలాదిమంది చిన్నారులు పాఠశాలలో చేరేందుకు ఇబ్బంది పడాల్సి ఉండేది. ప్రస్తుతం ఐదేళ్ల ఐదు నెలల నిబంధనలు తీసుకొచ్చామన్నారు. ఈ ఏడాది జూన్ 1కి ఐదేళ్లతోపాటు ఐదు నెలలు నిండితే పాఠశాలలో చేరేందుకు అర్హులవుతారన్నారు. ఎల్‌కేజీలో చేరేవారికి 4ఏళ్ల వయో పరిమితి విధించామన్నారు. ఇది కేవలం రాష్ట్ర అకడమిక్‌కు సంబంధించి మాత్రమే అన్వయించనుందన్నారు. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ బోర్డులకు సంబంధించి ఎటువంటి నిర్ణయం తీసుకో లేదన్నారు.




హామీలన్నీ అమలు చేస్తున్నాం

- బీజేపీ వారికి కనిపించడం లేదు
- అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తాం : సీఎం



కలబురగిలో వేదికపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం సిద్దరామయ్య తదితరులు

బెంగళూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ రాష్ట్రంలో అమలు చేస్తున్నామని, అయితే బీజేపీ వారికి అవి కనిపించడం లేదని సీఎం సిద్దరామయ్య మండిపడ్డారు. కలబురగిలో బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శ్రీకారం చుట్టారు. ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు మల్లికార్జున ఖర్గే, డీసీఎం డీకే శివకుమార్, మంత్రులు, ప్రియాంక ఖర్గే, శరణ ప్రకాశ్ పాటిల్, సుధాకర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గుల్బర్గా మెడికల్ కళాశాలకు అనుబంధంగా రూ.216 కోట్ల రూపాయలతో నిర్మించిన సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిని ఆయన జాతికి అంకితం చేశారు. బీజేపీవారు కలబురగికి వచ్చి అభివృద్ధి ఎలా ఉంటుందో వచ్చి పరిశీలించుకోవచ్చన్నారు. ప్రతి జిల్లాలో మెడికల్ కళాశాల, ట్రామా సెంటర్, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి, కేన్సర్ ఆసుపత్రి ఉండాలనేది తమ ఆశయమన్నారు. తద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందించాలని భావిస్తున్నామన్నారు. అందరికీ విద్య, వైద్యం అందిసామన్నారు అభివృద్ధికి నిధులు లేవని బీజేపీ అబద్ధాల ప్రచారం చేస్తోందన్నారు. అనంతరం ప్రజలనుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఆ తర్వాత బీదర్‌లో రద్దు అయిన విమాన సేవలను పునరుద్ధరించారు. బీదర్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె, ఎంపీ సాగర్‌ఖండ్రె, మంత్రి రెహమాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1584.61	1,578.83
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	324	162
నీటి నిల్వ (టీఎంసీలు)	7.07	3.93



నేలకొరిగిన బొప్పాయి పంట

అకాల వర్షానికి నేలకొరిగిన బొప్పాయి

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): విజయనగర జిల్లా పరిధిలో మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం దాకా భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వానతో జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. కూడ్లిగి తాలూకా గుడేకోట ఫిర్కా వ్యాప్తిలోని సిద్దేశ అనే రైతుకు చెందిన 9 ఎకరాల బొప్పాయి పంట నేల కొరిగింది. చేతికొచ్చిన పంట నేలకూలడంతో తీవ్ర నష్టాలు తప్పవని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. నెల బొమ్మనహళ్ళి, చంద్రశేఖరలతో పాటు వివిధ గ్రామాల్లో పిడుగులు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసి లక్షలాది రూపాయలు ఆస్తినష్టం వాటిల్లింది. వ్యవసాయ శాఖ అధికారులు నేలకూలిన పంటలపై సమీక్షలు జరుపుతున్నారు.

సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

గుడిబండ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.కె.పాళ్యం గ్రామ సమీపంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలాన్ని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తిలు టీడీపీ నాయకులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈనెల 18వతేదీన శంకుస్థాపన చేసేందుకు స్థలాన్ని పరిశీలించారు. సబ్‌స్టేషన్ ఏర్పాటైతే విద్యుత్ లోఓల్టేజీ సమస్య పరిష్కారమవుతుందని సబ్‌స్టేషన్‌కు స్థలం అందజేస్తున్న రైతులతో చర్చించారు. ఈకార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మద్దనకుంటప్ప తదితరులు పాల్గొన్నారు.

సండూరు అడవుల్లోకి నో.. ఎంట్రీ..!

● జార్కండ్ బొగ్గు గనుల తరహాలో ప్రత్యేక నిబంధనలు ● ఇనుము నిక్షేపాల రక్షణకు అటవీ శాఖ నిర్ణయం

బళ్లారి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): దేశంలోనే అత్యంత మేలు రకం ఇనుప నిక్షేపాలు కలిగిన సండూరు అటవీ ప్రాంత రక్షణకు అటవీశాఖ సిద్ధమయ్యింది. జార్కండ్ లోని బొగ్గు ఉన్న ప్రదేశంలో కొత్త గా తవ్వకాలకు అనుమతులు ఇవ్వకుండా "నో గో" జోన్ జీఓ విడుదల చేశారు. అంటే ఈ ప్రాంతంలోకి ఎవ్వరినీ అనుమతించరు. నేషనల్ మినరల్ యాక్టు-19 నిబంధనల మేరకు అక్కడ ప్రవేశం నిషేధించారు. ఇదే విధానాన్ని జిల్లా సండూరు అటవీ ప్రాంతంలోనూ అమలు చేయాలని నిర్ణయించారు. ఇందుకు ఏరియాలను కూడా గుర్తించింది. సండూరు ఫారెస్టు అంటే దేశంలోనే అత్యంత సుందరమైన ప్రదేశాల్లో ఇదొకటి. స్వాతంత్ర్యానికి ముందు ఈప్రాంతంలో మహాత్మాగాంధీ కూడా వచ్చి పరిశీలించి 'సండూరు ఈజ్ వెరీ బ్యూటీఫుల్' అని తన పుస్తకంలో రాసుకున్నారు. ఇక్కడి ఇనుప నిక్షేపాలు కూతా అత్యంత నాణ్యమైనవి. స్వాతంత్ర రాక మునుపు ఇక్కడి ఇనుప ముడిఖనిజాన్ని ఆయుధాల తయారీకి ఉపయోగించేవారు.



సండూరు అటవీ ప్రాంతం

● సండూరు ఫారెస్టు మొత్తం 74.131 ఎకరాలు ఉంది. ఇందులో సుమారు 8 వేల పైచిలుకు విస్తీరణంలో ఇనుము తవ్వకాలకు లీజ్‌కు ఇచ్చారు. ఇందులో ప్రస్తుతం తవ్వకాలు 4,200 హెక్టార్లలో సాగుతున్నాయి. మిగిలిన 4.942ఎకరాల విస్తీరణంలో సీ-కేటగిరీ కింద లోకాయుక్త నివేదికలో తేలడంతో ఆగిపోయాయి. సండూరు ఫారెస్టు ఏరియాలో ఇనుప ఖనిజ నిక్షేపాలు ఉండే ప్రాంతలో కొత్తగా మైనింగ్ లీజ్ కోసం కొందరు ప్రయత్నం చేస్తున్నారు. గనుల శాఖ అనుమతులు ఇచ్చినా అటవీ శాఖ అడ్డుకోవడంతో ఆ ప్రయత్నాలు ఆగిపోయాయి. కేంద్ర గనుల శాఖ మంత్రి హెచ్.డి కుమారస్వామి కూడా గతంలో ఇక్కడ మైనింగ్ లీజ్ పొందేందుకు ప్రయత్నం చేశారు. గనుల శాఖ సరే అన్నా.. అటవీశాఖ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇక్కడ మైనింగ్ జరిగితే పురాతన కుమారస్వామి దేవాలయం, సండూరు అటవీ ప్రాంతం వాతావరణ కాలుష్యం జరుగుతుందని ఇది మైనింగ్ కార్యకలాపాలు చేయడం సాధ్యం కాదని నివేదించింది.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

బళ్లారి సిటీ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాయచూర్, బళ్లారి, కొప్పళ, విజయనగరం జిల్లా పాల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య(కేఈఎఫ్) మిగులు ఉద్యోగులుగా పేర్కొంటూ 60మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగించారని, వారిని విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూసీ సత్యబాబు డిమాండ్ చేశారు. బాధిత ఉద్యోగులు బుధవారం సీఐటీయూ కార్మికుల నేతృత్వంలో యూనియన్ ప్రధాన కార్యాలయం ముందు నిరవధిక ధర్నా ప్రారంభించారు. ఈసందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ.. అనేక కారణాల వల్ల యూనియన్ నష్టాల్లో నడుస్తోందన్నారు. ఈనెల 7న వివిధ విభాగాల్లో అవసరమైన సంఖ్యకంటే ఎక్కువగా ఉన్నట్లు భావించి 60మందిని తొలగించడం అన్యాయమన్నారు. గత 10-15సంవత్సరాల నుంచి కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్నవారిని తొలగిస్తే బతకడం ఎలా సాధ్యమన్నారు. నిరసనకు కాంగ్రెస్ నాయకులు కల్లుకంబ పంపాపతి, సీఐటీయూకు చెందిన సత్యబాబు, గిరి, శివు, నెట్టకల్లప్ప తదితరులు పాల్గొన్నారు.



ధర్నాకు మద్దతు ఇస్తున్న నాయకులు కల్లుకంబ పంపాపతి, సత్యబాబు

కొండపై చెలరేగిన మంటలు



కొండపై ఎగసి పడుతున్న మంటలు

బళ్లారి సిటీ,ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఆనకట్ట సమీపంలోని కొండ పై బుధవారం సాయంత్రం మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది,ఆటవీ సిబ్బంది మంటలను ఆర్పడానికి ప్రయత్నిస్తున్నారు. తుంగభద్ర జలాశయం కుడిప్రక్కన కొండపై వైకుంఠ గెస్ట్ హౌస్, పవన విద్యుత్ ప్లాంట్లు ఉండగా, విజయపుర, చిత్రదుర్గ రహదారి ప్రక్కన మరొక కొండపై మంటలు చెలరేగాయి. అక్కడ ఒక విండ్ మిల్లు పనిచేస్తోంది. గాలి ఉప్పెనకు గాలి టర్బైన్ బ్లేడ్లు తిరుగుతున్నట్లే అగ్ని జ్వాలలు హైవే నుండి దూర ప్రాంతాలకు పైకి లేచి పడుతూ కనిపించాయి. ఉద్దేశపూర్వకంగా నిప్పంటించినట్లుగా భావిస్తున్నారు. మంటలు అదుపులో ఉన్నాయని, ఆందోళన అవసరం లేదని డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అర్సలన్ తెలిపారు.

గ్యారెంటీలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

● పథకాల అమలు కమిటీ అధ్యక్షుడు చిదానందప్ప

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న ఐదు గ్యారెంటీల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని గ్యారెంటీ పథకాల అమలు ప్రాధికార జిల్లా అధ్యక్షుడు చిదానందప్ప అధికారులకు సూచించారు. బుధవారం నగరంలోని జిల్లా పంచాయతీ పాత సభాంగణంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి గ్యారెంటీ పథకాల ప్రగతి పరిశీలనా సభకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. పేద, బడుగు ప్రజలను ఆదుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పంచ గ్యారెంటీ లను అమలు చేస్తోందని, ఈ పథకాలు దుర్వినియోగం కాకుండా నిజమైన పేదలకు అందేలా చూడాలన్నారు. అదేరీతిలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి పథకాలు వారి దరిచేరేలా అధికారులు కృషి చేయాలని కోరారు. గృహలక్ష్మి పథకంలో గత ఏడాది 2023 నుంచి 2024 వరకు మొత్తం 43,92,946 మంది లబ్ధిదారులకు రూ.878,58,92,000 ప్రభుత్వం నేరుగా బ్యాంకు ఖాతాలో జమా చేసినట్లు తెలిపారు. జనవరి నెలకు సంబంధించి డబ్బు జమ చేసినట్లు మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి విజయ్‌కుమార్ సభకు వివరించారు. అనంతరం జిల్లా పంచాయతీ కార్యనిర్వహణాధికారి మహ్మద్ హ్యారీస్ సుమైర్ మాట్లాడుతూ గృహలక్ష్మి పథకం దుర్వినియోగం కాకుండా చూడాలన్నారు. ఐటీ, జీఎస్టీ సంబంధిత కారణాల చేత సౌలభ్యాలు పొందని వారిని గుర్తించాలని సూచించారు ఎన్‌పీసీఐ లింక్ కాని లబ్ధిదారులు, వయోమితి కారణంగా మృతి చెందిన వారి సమచారం గుర్తించాలన్నారు. తాలూకా పంచాయతీ ఈఓ, గ్రామ పంచాయతీ పీడీలో, లీడ్ బ్యాంక్ అధికారులతో కలిసి గ్రామ పంచాయతీ స్థాయిలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం అన్న భాగ్య పథకం క్రింద 2023-2024 వరకు జిల్లాలో మొత్తం 1,81,10,436 మంది లబ్ధిదారులు ఇప్పటి వరకు రూ. 292.29కోట్లు పొందినట్లు జిల్లా ఆహార పౌరసరఫరా శాఖ అధికారి సకీనా సభకు వివరించారు. జెస్కాం శాఖకు సంబంధించి జిల్లాలో 3,18,885మంది అర్హులైన లబ్ధిదారులు ఉండగా మార్చి 31వ తేదీ వరకు 2,92,956మంది నమోదు చేసినట్లు తెలిపారు. 35,929 మంది ఇంకా నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు. ప్రభుత్వం 2023-25 మార్చి వరకు రూ.277.02 కోట్లు ప్రభుత్వం చెల్లించిందని జెస్కాం అధికారులు సభకు వివరించారు. శక్తి యోజన క్రింద బళ్ళారి విభాగం రవాణా శాఖ బస్సుల్లో జూన్ 2023 నుండి 2025 వరకు మహిళలు, వృద్ధులు యువతులు, ఆడపిల్లలు చేరి మొత్తం 4,52,37,755 మంది ఉచిత బస్సు సేవలు వినియోగించుకున్నారని, తద్వారా 167,99,61,992 రూపాయలు రవాణా శాఖ ఆదాయం పొందినట్లు కళ్యాణ కర్ణాటక విభాగం నియంత్రణ అధికారి వివరించారు. యువ నిధి క్రింద ఫిబ్రవరి 2025 వరకు జిల్లాలో 7,618 మంది నిరుద్యోగ అభ్యర్థులు నమోదు చేసుకోగా ఇప్పటి వరకు రూ.9,79,38,000 లబ్దిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు జిల్లా ఉద్యోగ వినిమయ అధికారి సభకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పంచ గ్యారెంటీల ఫలాలు అర్హులైన లబ్ధిదారులకు అందాలని, పథకాల అమలులో సాంకేతికపరమైన సమస్యలను నివారించేందుకు ఆయా పంచాయతీ స్థాయిలో గ్యారెంటు లబ్ధిదారులతో సంవాదన కార్యక్రమాలు నిర్వహించాలని జడ్పీ సీఈఓ సూచించారు. ఈ సందర్భంగా జిల్లా గ్యారెంటీ పథకాల అమలు ప్రాధికార ఉపాధ్యక్షుడు లతా సోమప్ప, బళ్ళారి తాలూకా గోనాళ్ నాగభూషణగౌడ, కురుగోడు తాలూకా అధ్యక్షుడు నాగేనహళ్ళి మల్లికార్జున, ఆహార పౌరసరఫరా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సకీనా, బళ్ళారి గ్రామీణ జెస్కాం అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీయరు రంగనాథ్ బాబు, కళ్యాణ కర్ణాటక రోడ్డు రవాణా సంస్థ బళ్ళారి విభాగం నియంత్రణ అధికారి బాగ్‌బాన్, జిల్లా ఉపాధి శాఖ అధికారితో పాటు ఐదు తాలూకా పంచాయితీల ఇఓలు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ చిదానందప్ప



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి అబ్దుల్ రెహమాన్

మాదకద్రవ్యాలు ప్రాణాంతకం

● జిల్లా న్యాయాధికారి అబ్దుల్ రెహమాన్

బళ్లారి సిటీ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల వాడకం వైరస్ లాంటిందని, అవి ప్రాణాంతకం అని విజయనగరం జిల్లా న్యాయాధికారి అబ్దుల్ రెహమాన్ నందగాడి అన్నారు. విజయనగరంలోని తాలూకా లీగల్ సర్వీసెస్ కమిటీ, బార్ అసోసియేషన్, విద్యాశాఖ, పోలీస్ శాఖ, ఆరోగ్య శాఖ, సమాచార ప్రజా సంబందాల శాఖల సహకారంతో నగరంలోని విజయనగర కళాశాలలో మాదకద్రవ్యాల దుర్వినియోగ నివారణ, నిర్వహణ, ఎన్‌డీపీఎస్ చట్టంపై నిర్వహించిన సెమినార్ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. యువతలో మాదకద్రవ్యాల వ్యసనం పెరుగుతోందని, దాని దుష్ప్రభావాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు వ్యసనాల భారిన పడకుండా చదువుపై లక్ష్యం సాధించాలన్నారు. న్యాయమూర్తి ప్రశాంత్ నాగలపుర మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో అనుకరణ, అనుమానాస్పద మనస్తత్వం ప్రబలంగా ఉంటాయన్నారు. ఎస్పీ శ్రీహరిబాబు మాట్లాడుతూ యువత ఎలాంటి మాదకద్రవ్యాలను వాడకూడదని, వాటి దుష్ప్రభావాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈసందర్భంగా ప్రభుత్వ వైద్యశాల నిపుణుడు డాక్టర్ సోమశేఖర్, విజయనగర కళాశాల అధ్యక్షుడు మేత్రి మల్లికార్జున, సీనియర్ న్యాయాధికారులు హేమలత బి.హుళ్లూరు, రమేశ్‌బాబు, చైత్ర, శృతి,బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రహ్లాద్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసమూర్తి, గుడేకోట నాగరాజు, నటరాజ అక్కి, ప్రిన్సిపాల్ ప్రభుగౌడ పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన ర్యాలీ



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

సిరుగుప్ప, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ అవయవదానంపై అవగాహన పెంచుకోవాలని, అవయవ దానంతో ఎందరో ప్రాణాలు కాపాడినవారు అవుతామని శిరిగేరి ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి మహమ్మద్ ఖాసీమ్ అన్నారు. బుధవారం తాలుకాలోని శిరిగేరి గ్రామంలో ప్రభుత్వాస్పత్రి ఆధ్వర్యంలో అవయవ దానంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కళ్లు, కిడ్నీలు, తదితర అవయవాలను దానం చేస్తే పుణ్యం లభిస్తుందని తెలిపారు. దానం చేసే వ్యక్తులు ప్రభుత్వాస్పత్రిలో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రభుత్వాస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అనువైన పథకాలు రూపొందించాలి

● ఏఐకేకేఎంఎస్ నాయకురాలు నాగమ్మాళ్



బళ్లారి సిటీ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రైతులకు అనుకూలంగా ఉండేలా కొత్త పథకాలను రూపొందించాలని ఏఐకేకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నాగమ్మాళ్ కోరారు. నగరంలో బుధవారం జిల్లా స్థాయి రైతు శిక్షణా శిబిరాన్ని ప్రారంభించిన ఆమె మాట్లాడారు. సమాజంలో మార్పు అవశ్యకతను రైతులు ఒప్పించాల్సిన అవసరం ఉందన్నారు. కానీ ఈ దేశంలో వ్యవసాయ యాంత్రీకరణ నేటి అవసరాలను తీర్చడానికి సరిపోలేదని, పాలకులు బంజరు భూమిని సాగుభూమిగా మార్చలేక వ్యవసాయాన్ని వెనుకబాటుతనానికి గురిచేశారన్నారు. నదీ జలాలను వ్యవసాయం కంటే కొంతమంది సంపన్న వ్యాపారవేత్త ప్రయోజనాలకే అధికంగా మళ్లిస్తున్నారన్నారు. పెట్టుబడి దారి వ్యవస్థను రూపుమారిస్తేనే రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోవింద్ సమావేశానికి అధ్యక్షత వహించారు. జిల్లా కార్యదర్శి గురల్లిరాజా, కమిటీ సభ్యులు లింగప్ప, కల్లుకంబ పంపాపతి, మాబుసాబు, ఖాసీమాబ్, రైతులు ఓపాలగౌడ,బసప్ప, శ్రీనివాస్,కాశీనాథ్, కాళింగప్ప నిర్వాహకులు పాల్గొన్నారు.

సామూహిక వివాహాలను సద్వినియోగం చేసుకోండి



వివాహ కార్యక్రమంలో ఎమ్మెల్యే జేఎన్ గణేశ్, మఠాధిపతులు

కంప్లి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పట్టణాల్లో దాతలు నిర్వహించే సామూహిక వివాహాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా మెరుగుపడాలని కంప్లి నియోజక వర్గం ఎమ్మెల్యే గణేష్ సూచించారు. కురుగోడు తాలుకా పరిధిలోని సోమలాపురం గ్రామంలో బుధవారం పరమపూజ్య చిదానందప్ప పుణ్యస్మరణ సందర్భంగా నిర్వహించిన సామూహిక వివాహాల్లో 68 జంటలు ఒక్కటయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ కంప్లి నియోజకవర్గంలో సోమలాపురం చిదానంద తాత అవదూత మఠంలో ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. హెచ్ వీరాపురం జడే సిద్దేశ్వరస్వామి చిదానందప్ప తాత వివిధ మఠాధీశ్వరులు పాల్గొన్నారు.

కంటి ఆస్పత్రికి భూమిపూజ

పట్టణ సమీపంలోని కొట్టాల రోడ్డు చిక్కినకొప్ప వీరశరణ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించనున్న కంటి ఆస్పత్రికి బుధవారం ఎమ్మెల్యే గణేష్, సంఘం అధ్యక్షులు లింగన్నగౌడ భూమిపూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఆస్పత్రి నిర్మించడం హర్షణీయమన్నారు.ఆస్పత్రి ఏర్పాటుకు 17 సెంట్ల భూమిని కంప్లి కొట్టాల గ్రామానికి చెందిన పోలూరు సత్యనారాయణ అందజేయడం అభినందనీయమన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి రథోత్సవం

కంప్లి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని ఇటిగి గ్రామంలో బుధవారం సాయంత్రం ఆంజనేయస్వామి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయం నుంచి స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఊరేగింపుగా తీసుకువచ్చి రథంలో ప్రతిష్టించారు. అలంకరించిన రథానికి పూజలు చేసి, మహామంగళహారతి నిర్వహించి, భక్తులు జయజయ ధ్వానాల మధ్య రథోత్సవం ప్రారంభించారు. ఆలయం నుంచి ఎదురు బసవన్నకట్ట వరకు రథాన్ని లాగారు. రథోత్సవానికి ఇటిగితో పాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి పూలు పండ్లతో మొక్కులు సమర్పించుకున్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

హోసూరు జోన్

ఘనంగా మారియమ్మన్ రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న మేయర్ సత్య

హోసూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ పరిధిలోని మిడుకరపల్లిలో పురాతనమైన స్వయంభుగా వెలసిన మారియమ్మన్ అమ్మవారి రథోత్సవం వైభవంగా జరిగింది. మేయర్ సత్య, డిప్యూటి మేయర్ ఆనందయ్య, ఆరోగ్యస్థాయి కమిటీ మాదేశ్వరన్ ప్రత్యేక ఆహ్వానితులుగా రథోత్సవంలో పాల్గొన్నారు. ప్రాంతీయ కమిటీ చైర్మన్ రవి, ఏరియా కార్యదర్శి తిమ్మరాజ్, సెన్నీరప్ప పూజల్లో పాల్గొని రథాన్ని తాడుతో లాగారు. ఉత్సవంలో గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. నీరు, మజ్జిగ పంపిణీ చేసి అన్నసంతర్పణ నిర్వహించారు.

అదనపు పన్ను రద్దు చేయాలని డిమాండ్

హోసూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మైనింగ్ భూములపై అదనపు పన్ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ క్రషర్ యజమానులు నిరవధిక సమ్మెకు దిగారు. కృష్ణగిరి జిల్లా క్రషర్ యజమానుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం రాజీ చర్చల సమావేశం జరిగింది. నాల్గో తేదీ నుంచి కొత్త నిబంధన అమలులోకి వచ్చిందని, ప్రస్తుతం వెలికితీసే ఖనిజాలపై విధించేపన్నుతోపాటు ఖనిజాలను తవ్వే భూమిపై టన్నుకు రూ.90 అదనపు పన్ను చెల్లించాలని కొత్త ఆదేశాలలో పేర్కొన్నారు. మైనింగ్ ల్యాండ్ బేరింగ్ ట్యాక్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ క్వారీ క్రషర్ యజమానులు మంగళవారం నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. సమావేశం అనంతరంసంఘం కార్యదర్శి ప్రేమ్‌నాథ్ మీడియాతో మాట్లాడుతూ ట్యాక్స్‌ను రూ.90కు పెంచడం భారమన్నారు. వెంటనే పెంచిన పన్నును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు.

కాలువలో నురగతో రైతుల్లో ఆందోళన

హోసూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని కెలవరపల్లి జలాశయం నుంచి నీటిపారుదలకోసం థెన్‌పెన్నై (దక్షిణ పినాకిని) నదిలోకి విడుదల చేసిన నీటిలో నురుగ అధికంగా వస్తుండంతో రైతులలో ఆందోళన నెలకొంది. కర్ణాటకలోని నంది కొండలలో ఉద్భవించే దక్షిణ పినాకిని నది అనేక కిలోమీటర్లు ప్రయాణించి తమిళనాడులోకి ప్రవేశిస్తుంది. ఈ నది నీరు హోసూరు సమీపంలోని కెలవరపల్లి డ్యాంలోకి చేరుతుంది. ప్రస్తుతం నదిలోని నీరు ఆనకట్టలోకి రావడం లేదు. ఆనకట్ట సామర్థ్యం మొత్తం 40.67 అడుగులు. ప్రస్తుతం 290 క్యూబిక్ నీరు ఇన్‌ఫ్లో ఉండగా ఆమేరకు బయటకు వదులుతున్నారు. ఆనకట్ట నుంచి నీటిపారుదల కోసం తెరిచిన కుడి, ఎడమ కాలువలలో దక్షిణ పినాకిని నదిలోకి ప్రవహించే నీరు పెద్ద నురగులా కనిపిస్తోంది. దుర్వాసన వెదజల్లుతుండడంపై రైతులలో ఆందోళన వ్యక్తం అవుతోంది.



కెలవరపల్లి కాలువలో పొంగుతున్న నురగ

లారీల సమ్మెతో వ్యాపారులకు తీవ్ర నష్టం

● ప్రభుత్వం చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలి : సంఘం కార్యదర్శి షణ్ముగప్ప



హోసూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): డీజిల్, టోల్ చార్జీల పెంపును ఖండిస్తూ కర్ణాటకలో చేపట్టిన లారీల సమ్మెతో సుమారు 4వేలకోట్ల రూపాయల లావాదేవీలు ఆగిపోయాయని దక్షిణాది రాష్ట్రాల యజమానుల సంఘం ప్రధాన కార్యదర్శి షణ్ముగప్ప తెలిపారు. హోసూరులో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కర్ణాటక ముఖ్యమంత్రితో మంగళవారం జరిపిన చర్చలు ఫలించలేదన్నారు. సమ్మె నిరవధికంగా కొనసాగే అవకాశం ఉందన్నారు. కర్ణాటకలో 95శాతం ట్రక్కులు నడవడం లేదన్నారు. మహారాష్ట్రలోని నాసిక్ నుంచి 100 ట్రక్కులలో ఉల్లిగడ్డలు రాలేదని, 400 లోడ్‌ల దినుసులు రాలేదన్నారు. మరోవైపు నిర్మాన సామగ్రి ఆగిపోయిందన్నారు. కర్ణాటక నుంచి ఇతర రాష్ట్రాలకు వస్తువుల రవాణా ఆగిపోయిందన్నారు. ఐదు రాష్ట్రాల ట్రక్కు యజమానుల సంఘాల నాయకులు సమిష్టిగా ఒక నిర్ణయం తీసుకుంటారన్నారు. డీజిల్ ధరలను తగ్గించని పక్షంలో ఆటోలు, ట్యాక్సీలకు కిలోమీటరుకు నిర్ణయించిన చార్జీల మాదిరిగానే లారీ చార్జీలను నిర్ణయించాలని కోరుతూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నిరుపేదలకు ప్రభుత్వ భూమిని అందించాలి



గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

బళ్లారిరూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): భూమి లేని పేదలకు ప్రభుత్వ భూమిని అందజేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని శ్రీధరగడ్డ గ్రామంలో ఎస్‌యూసీఐ స్థానిక కమిటీ కార్యదర్శి ఏ దేవదాసు నేతృత్వంలో పంచాయతీ కార్యదర్శి రాజాసాబ్‌కు పలు డిమాండ్లతో వినతిపత్రం అందజేశారు. ఎస్‌యూసీఐ సభ్యులు హనుమంతప్ప, జగదీష్, నాయక్, బసమ్మ, అమీర్ షా బేగమ్, నాగమ్మ, గౌరమ్మ, గ్రామ ప్రముఖులు హనుమంతప్ప తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

బళ్లారిరూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలో మోతీ సర్కిల్ నుంచి ఏపీ ఎంసెట్ సర్కిల్ వరకు రూ. 12 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఆరు లైన్ల రహదారి నిర్మాణానికి పలువురు నాయకులు భూమిపూజ చేశారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యులు నాసిర్ హుస్సేన్ సిటీ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి, మాజీ మంత్రి నాగేంద్ర మేయర్ నందీష్, కార్పొరేటర్ ప్రభంజన్ కుమార్, మించు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజలో ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ (వర్ధంతి)



ఉపాధ్యాయవృత్తికి వన్నె తెచ్చిన 'భారతరత్న' గ్రహీత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 1888 సెప్టెంబరు 5న తమిళనాడు రాష్ట్రం తిరుత్తణిలో వలసవెళ్లిన తెలుగు దంపతులకు జన్మించారు. దేశ తొలి ఉప రాష్ట్రపతి, రెండో రాష్ట్రపతిగా అత్యున్నత హోదాలలో కొనసాగారు. ఉపాధ్యాయుడిగా, ప్రొఫెసర్‌గా, వైస్‌చాన్స్‌లర్‌గా వ్యవహరించారు. అత్యంత క్లిష్టకాలంలో ప్రధానులకు మార్గదర్శకం చేశారు. సోవియెట్ యూనియన్‌కు దేశ రెండో రాయబారిగా, బెనారస్ హిందూ యూనివర్సిటీకి నాల్గో వైస్‌చాన్స్‌లర్‌గా వ్యవహరించారు. ఆయన రచించిన 'ఇండియన్ ఫిలాసఫీ' పుస్తకం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఆయన జయంతిని 'ఉపాధ్యాయ దినోత్సవం'గా ఆచరిస్తున్నారు. సాహితీరంగంలో నోబెల్ ప్రైజ్‌కు 16సార్లు నామినేట్ అయ్యారు. 1975 ఏప్రిల్ 17న కన్నుమూశారు.

నిసర్గదత్త మహారాజ్ (జయంతి)



నిసర్గదత్త మహారాజ్ 1897 ఏప్రిల్ 17న బాంబేలో జన్మించారు. అసలు పేరు మారుతి శివరామ్‌పంత్ కాంబ్లి. తత్వవేత్త. సిద్ధరామేశ్వర మహరాజ్ గురువు వద్ద బోధనలు పొందారు. ధ్యానంతో కూడిన నిసర్గయోగాను బోధించారు. మరాఠీలోని ఆయన బోధనలను మారిస్ ఫ్రిడ్‌మన్ అనే వ్యక్తి ఆంగ్లంలోకి 'ఐ యామ్ దట్' పేరిట అనువాదం చేశారు. ఉత్తర అమెరికా, యూరప్‌లలో ఎంతో పేరొందారు. 1981 సెప్టెంబరు 8న కన్నుమూశారు.

గీత్ సేథి (పుట్టినరోజు)



బిలియార్డ్స్‌లో రాణించిన 'పద్మశ్రీ' గ్రహీత గీత్ సిరిరామ్ సేథి 1961 ఏప్రిల్ 17న ఢిల్లీలో జన్మించారు. రెండు వరల్డ్‌రికార్డ్సు, ఆరుసార్లు ప్రొఫెషనల్ లెవెల్ లోనూ, మూడుసార్లు అమెచ్యూర్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌గా గెలుపొందారు. రాజీవ్ ఖేల్ రత్న, అర్జున, కేకే బిర్లా అవార్డు తదితర పురస్కారాలు పొందారు. ఆటో బయోగ్రఫీ 'సక్సెస్ వర్సెస్ జాయ్' పుస్తకం స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ప్రకాశ్ పదుకొనెతో కలసి ఒలింపిక్ గోల్డ్ క్వెస్ట్' పేరిట క్రీడాభివృద్ధికి ఫౌండేషన్ ఏర్పాటు చేశారు.

విక్రమ్ (పుట్టినరోజు)



దక్షిణాదిన పేరొందిన ప్రముఖ నటుడు విక్రమ్ 1966 ఏప్రిల్ 17న తమిళనాడు రాష్ట్రం చెన్నైలో జన్మించారు. అసలు పేరు కెన్నెడీ జాన్ విక్టర్. విభిన్నమైన పాత్రలలో రాణించి జాతీయస్థాయిలో ఒకటి, 7 ఫిల్మ్‌ఫేర్ అవార్డ్సు సౌత్, తమిళనాడు స్టేట్ ఫిల్మ్ అవార్డు, కళైమామణి పురస్కారం అందుకున్నారు. నటుడు, నిర్మాత, నేపథ్య గాయకుడిగా రాణించారు. పలు కార్యక్రమాలకు రాయబారిగా ఉన్నారు. అంతేకాక ఫౌండేషన్ ద్వారా పేద విద్యార్థుల విద్య, వైద్యం తదితర సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.

మార్కెట్‌లోకి రెడ్‌మి ఏ5 మోడల్

బెంగళూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అత్యాధునిక సాంకేతికతో కూడిన మొబైళ్లను మార్కెట్‌లోకి తీసుకొచ్చే రెడ్‌మి ఏ5 మోడల్‌ను లాంఛనంగా విడుదల చేసింది. ఈమేరకు బెంగళూరులో బుధవారం షియోమి మార్కెటింగ్ చీఫ్ అనుజ్ శర్మ ప్రకటన విడుదల చేశారు. 120హెచ్‌జడ్ హై రిఫ్రెష్ రేట్ డిస్‌ప్లే 32ఎంపీ డ్యూయెల్ కెమెరా సిస్టమ్ కలిగి ఉందన్నారు. రెడ్‌మి ఏ5 లేటెస్ట్ వెర్షన్‌గా ఉందని అనుజ్‌శర్మ అభిప్రాయపడ్డారు.

శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయం



శిథిలావస్థలో శిశుఅభివృద్ధి యోజన కార్యాలయం

సిరుగుప్ప, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): శిథిలావస్థకు చేరుకున్న పాత శిశు అభివృద్ధి యోజనా కార్యాలయాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. తాలుకా పంచాయతీ కార్యాలయం ఎదుట వున్న ఈ కార్యాలయం వినియోగంలో లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. పైకప్పు లేచిపోయి గోడలు బీటలు వారాయి. పలుమార్లు ఈ విషయంపై అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. నిత్యం ఈ ప్రాంతంలో జన సంచారం అధికంగా ఉంటుందని, ఏదైనా ప్రమాదం జరిగితే ఇబ్బందులు తప్పవని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ భవనాన్ని తొలగించాలని కోరుతున్నారు.

కేంద్రం దిగి రావాల్సిందే..

రాయచూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎయిమ్స్ ఏర్పాటు కోసం సాగుతున్న చారిత్రక పోరాటానికి కేంద్ర ప్రభుత్వం దిగి రావాల్సిందేనని ఎయిమ్స్ పోరాట సమితి కన్వీనర్ డాక్టర్ బసవరాజ్ కళస అన్నారు. రెండున్నర ఏళ్లుగా నిరవధిక సమ్మె కొనసాగుతున్నా కేంద్ర ప్రభుత్వం రాయచూరుకు ఎయిమ్స్ మంజూరు చేయకుండా జాప్యం చేస్తుండడం ఆశ్చర్యకరమన్నారు. నగరంలోని మహాత్మాగాంధీ స్టేడియంలో నిర్వహిస్తున్న ఎయిమ్స్ నిరవధిక సమ్మె దీక్ష శిబిరంలో బుధవారానికి 1070వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మాట్లాడిన డాక్టర్ బసవరాజ్ కళస, ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరికగా ఉన్న ఎయిమ్స్‌ను మంజూరు చేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి ఉన్న అడ్డంకులేమో అర్థంకావడం లేదన్నారు. ఎన్నికల సందర్భంగా ఎయిమ్స్ మంజూరుకు సమ్మతించిన ప్రజాప్రతినిధులు ఆ దిశగా ఎందుకు ప్రయత్నం చేయడం లేదని నిలదీశారు. నాయకులు తమవంతు పాత్ర పోషించాలని ఈ సందర్భంగా పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు.

సాంకేతికతకు అనుగుణంగా విద్యార్థులు ఎదగాలి

పీఈఎస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జవహర్

బెంగళూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): సాంకేతికతకు అనుగుణంగా విద్యార్థులు ఎదగాలని ప్రపంచమే సాంకేతిక విప్లవంలో దూసుకుపోతోందని పీఈఎస్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జవహర్ దొరస్వామి అభిప్రాయపడ్డారు. ఎలక్ట్రానిక్ సిటీ క్యాంపస్‌లో ఆటోమేషన్ రోబోటిక్స్ సెంటర్ (ఏఆర్‌సీ)ను బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. కుకా రోబోటిక్స్ సహకారంతో ఏఆర్‌సీను ప్రారంభించినట్టు తెలిపారు. ఆటోమేషన్ రోబోటిక్స్, స్మార్ట్ మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీ, హ్యాండ్స్ ఆన్ నైపుణ్యతలో ఇంజనీరింగ్ విద్యార్థులకు అనుకూలంగా ఉంటుందనే కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. కుకా సంస్థ రోబోటిక్స్ రంగంలో అపారమైన అనుభవం కలిగి ఉందన్నారు. ఉత్తమమైన శిక్షణతో విద్యార్థులలో అనుకున్న లక్ష్యాలు సాధ్యమవుతాయని పీఈఎస్ నిరంతరంగా పాటుపడుతోందన్నారు. విప్రో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజనీరింగ్ సీఈఓ ప్రతీక్‌కుమార్ మాట్లాడుతూ కోర్ మాన్యుఫాక్చరింగ్ ఆటోమేషన్ రంగాలలో ఇంజనీర్లకు డిమాండ్ పెరుగుతోందన్నారు. పీఈఎస్ యూనివర్సిటీతో కలసి ఇప్పటికే పలువురికి శిక్షణలు ఇచ్చామన్నారు. కుకా రోబోటిక్స్ ఇండియా సీఈఓ రెన్‌హోల్డ్‌గ్రాస్ ముఖ్యులుగా పాల్గొన్నారు. పీఈఎస్ వీసీలు డాక్టర్ జే సూర్యప్రసాద్, నాగార్జున సాధినేని, రిజిస్ట్రార్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



కుకా ఏఆర్‌సీ ప్రారంభంలో పీఈఎస్ వర్సిటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జవహర్ దొరస్వామి తదితరులు

చెరువు ఆక్రమణల తొలగింపునకు సహకరించండి

మే 15లోగా సర్వే ప్రక్రియ: తహసీల్దార్

ముళబాగిలు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): చెరువుల ఆక్రమణల తొలగింపునకు సంబంధించి జిల్లాధికారి ఆదేశాల మేరకు మే 15లోపు సర్వే ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రజలంతా సహకరించాలని తహసీల్దార్ వీ గీతా తెలిపారు. పట్టణంలోని మినీవిధానసౌధలో చెరువుల ఆక్రమణల తొలగింపునకు సంబంధించి సర్వే, రెవెన్యూ అధికారుల సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడారు. చెరువు ఆక్రమిత ప్రాంతంలో రైతులు ఎవరైనా పంట వేసియుంటే పంట చేతికి వచ్చాక తొలగించనున్నట్టు తెలిపారు. తాలూకాలో 803 చెరువులు ఉన్నాయని వీటిలో జిల్లా పంచాయతీ పరిధిలో 548, చిన్ననీటి పారుదల శాఖ పరిధిలో 35, నగరసభ పరిధిలో 6, గ్రామ పంచాయతీ, రెవెన్యూశాఖ పరిధిలో 214 చెరువులు ఉన్నాయన్నారు. వీటిలో ఇప్పటికే జిల్లా పంచాయతీకి చెందిన 548 చెరువులకు గాను 260 చెరువుల సర్వే ముగిసిందన్నారు. చిన్ననీటి పారుదలశాఖ పరిధిలోని 35కుగాను 34 చెరువలు సర్వే, అదే విధంగా 214 కుంటలపైకి 72 సర్వే ముగిసిందన్నారు. చెరువుల సర్వే ముగిశాక కంచె నిర్మించి, నామఫలకాన్ని అమర్చనున్నట్టు తెలిపారు. చెరువు ఆక్రమణల తొలగింపు తర్వాత రాజకాలువ, స్మశానం, కాలిబాట, బండిబాట ఆక్రమణలు తొలగిస్తామన్నారు. సమావేశంలో తాలూకా పంచాయతీ ఈఓ డాక్టర్ సర్వేశ్, సర్వేశాఖ సహాయక డైరెక్టర్ ఉపతహసీల్దార్‌లు వెంకటేశయ్య, కొండప్ప, సుబ్రమణి, ఆర్‌ఐలు సతీశ్, శ్రీనివాస్, సదాహుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో తహసీల్దార్ గీతా తదితరులు

హులిమావు అభివృద్ధే లక్ష్యం



నమ్మ హుళిమావు డిజిటల్ బోర్డు ప్రారంభోత్సవంలో ప్రముఖులు

బొమ్మనహళ్ళి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మా ఊరు హుళిమావు అభివృద్ధి లక్ష్యమని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, డీసీసీ సభ్యుడు మధు పేర్కొన్నారు. బుధవారం బొమ్మనహళ్ళి నియోజకవర్గ పరిధిలోని హుళిమావు సర్కిల్‌లో నమ్మ హుళిమావు డిజిటల్ బోర్డును, ఆధునీకరించిన ఆర్చ్‌ను ప్రారంభించారు. ఇదే సందర్భంగా శ్రీకృష్ణ ఆటో స్టాండ్‌ను ప్రారంభించారు. బొమ్మనహళ్ళి కాంగ్రెస్ నాయకుడు ఉమాపతిగౌడ ముఖ్యులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ చరిత్ర కల్గిన హుళిమావు ప్రాంతంలో సీతారాముల ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. అయితే గతంలో పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తున్నారన్నారు. మంత్రి రామలింగారెడ్డి ఎంతో సహకారం అందిస్తున్నారన్నారు. ఉమాపతిగౌడ మాట్లాడుతూ స్థానిక సమస్యలను తమ దృష్టికి తెస్తే అధికారులతో చర్చించి పరిష్కరిచేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ లక్ష్మీనారాయణ, మీనాక్షి దేవాలయ ముఖ్యులు స్వరూప్‌కుమార్, రాఘవేంద్ర, ఉమా శ్రీనివాసరెడ్డి, ఉమ్రాజ్, మోనేశ్‌రెడ్డి, ఆది తదితరులు పాల్గొన్నారు.

పాల సహకార సంఘం ప్రతినిధిగా ఎమ్మెల్యే

బంగారపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని నెత్తబెలె పాల ఉత్పత్తిదారుల సహకారసంఘం నెలవారీ సమావేశంలో డైరెక్టర్‌గా ఉన్న ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామిని ప్రతినిధిగా ఎంపిక చేసినట్టు డెయిరీ అధ్యక్షుడు వెంకటేశప్ప తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే నారాయణ స్వామిని ఆత్మీయంగా సత్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశప్ప మాట్లాడుతూ సంఘంలోని 11మంది డైరెక్టర్ల అందరి అభిప్రాయంతో ఏకగ్రీవంగా ప్రతినిధిగా తీర్మానించినట్టు తెలిపారు. పాల ఉత్పత్తిదారుల సంఘాన్ని మరింత బలోపేతం చేయడం, గ్రామీణ ప్రాంతాలలో పాడిపై ఆధారపడిన మహిళలకు మరింత సాయం చేయాలన్నారు. సంఘంలోని అన్ని ప్రక్రియలు చట్టం పరిధిలో నియమాలకు అనుగుణంగా జరిగాయన్నారు. ఈ సందర్భంగా సంఘం ఉపాధ్యక్షుడు మునిస్వామిప్ప, డైరెక్టర్‌లు రాఘవేంద్ర, నారాయణస్వామి, మంజునాథ్, కృష్ణప్ప, లక్ష్మమ్మ, కవితా, సరసమ్మ, తాయమ్మ, ఆలంబాడి జ్యోతనహళ్ళి గ్రామపంచాయతీ అధ్యక్షురాలు నారాయణమ్మ పాల్గొన్నారు.



ప్రతినిధిగా ఎంపికైన ఎమ్మెల్యేకు ఆత్మీయ సత్కారం

మేలూరులో ఘనంగా కరగ ఉత్సవం



కరగధారితో వీరకుమారులు తదితరులు

శిడ్లఘట్ట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మేలూరు గ్రామంలో ధర్మరాయస్వామి ద్రౌపదమ్మ కరగ ఉత్సవం ఘనంగా జరిగింది. 37వ వార్షిక పూల కరగలో గ్రామస్థులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. కరగ ఊరేగింపుసాగిన ప్రాంతాలలో ఇళ్లముంగిట రంగోళి వేసి హారతితో స్వాగతం పలికారు. గ్రామవీధులను విద్యుద్దీపాలతో అలంకరించారు. గణేశ్ పూల కరగతో ఊరేగారు. మేళతాళాల నడుమ కరగ ఊరేగింపులో వీరకుమారులు భాగస్వామ్యులయ్యారు. కరగ ఉత్సవంలో భాగంగా ఆర్కెస్ట్రా ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్, మజీ మంత్రి వీ మునియప్ప, గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు ఆర్‌ఏ ఉమేశ్, గ్రామ పెద్దలు కేఎం నారాయణస్వామి, మునికృష్ణప్ప, గోవిందప్ప, శివరాజ్, ధర్మరాయస్వామి భక్తమండలి వహ్నికుల క్షత్రియసంఘంసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌ల ఢీ - ఇద్దరు మృతి, ఒకరికి గాయాలు



చంద్రేగౌడ (ఫైల్)



అశోక్ (ఫైల్)

చింతామణి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మదనపల్లి - చింతామణి రాష్ట్ర రహదారిపై నందిగానహళ్ళి వద్ద రెండు బైక్‌లు ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా మరో యువకుడు గాయపడిన సంఘటన మంగళవారం రాత్రి 8 గంటలకు జరిగింది. తాలూకాలోని కురుబూరుకు చెందిన చంద్రేగౌడ (70), కైవార గ్రామానికి చెందిన అశోక్ (26)లు మృతి చెందారు. గాయపడిన మరో యువకుడు కైవారకు చెందిన ఓంకార్‌గా గుర్తించారు. అశోక్, ఓంకార్‌లు స్నేహితులైన ఇద్దరూ సరిహద్దులోని బోయకొండ గంగమ్మ ఆలయానికి వెళ్లి మంగళవారం రాత్రి వాపసు వస్తుండగా ఎదురుగా వస్తున్న వ్యక్తి బైక్‌పై చంద్రేగౌడ రాగా ఢీకొన్నారు. ఘటనా స్థలాన్ని బట్లహళ్ళి పోలీసులు, హైవే పెట్రోల్ పోలీసులు పరిశీలించారు. మృతదేహాలను చింతామణి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తిని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం బెంగళూరుకు తరలించారు.

ప్రశాంతంగా సీఈటీ

రాయచూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మెడికల్ కోర్సుల్లో ప్రవేశం కోసం జిల్లా కేంద్రం రాయచూరు నగరంలో నిర్వహించిన సీఈటీ బుధవారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 21 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షల్లో 6534 మందికి గాను 6301 పరీక్ష రాయగా మిగితా 233 మంది అభ్యర్థులు గైర్హాజరైయ్యారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి అన్ని కేంద్రాల్లో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులు అరగంట ముందుగానే తమకు కేటాయించిన కేంద్రాల్లోకి చేరుకుని పరీక్షకు హాజరైయ్యారు. కాగా నగరంలోని ఎస్ఆర్‌పీఎస్ జూనియర్ కళాశాల కేంద్రాల్లో కొంత సాంకేతిక కారణాల వల్ల అభ్యర్థులు ఇబ్బందులకు గురి కావల్సి వచ్చింది. విద్యార్థుల గుర్తింపు కోసం ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ సాంకేతిక సమస్య తలెత్తి పని చేయకపోవడంతో దాదాపు అరగంటకు పైగా అభ్యర్థులు పరీక్ష కేంద్రాల వద్ద బయటే వేచి చూడాల్సి వచ్చింది. విషయాన్ని జిల్లాధికారి దృష్టికి తీసుకోరాగా అభ్యర్థుల వద్ద ఉన్న ఆధార్ కార్డుల ఆధారంగా వారిని పరీక్షకు అనుమతించాలంటు ఆదేశాలు రావడంతో అరగంట అనంతరం విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. అనంతరం సాంకేతిక కారణాలతో నిలిచి పోయిన బయోమెట్రిక్ తిరిగి పని చేయడం ప్రారంభించినట్లు అదనపు జిల్లాధికారి శ్రీనివాస్ భజంత్రి తెలిపారు.



సాంకేతిక కారణాలతో కళాశాల బయట వేచి ఉన్న విద్యార్థులు

మద్దతు ధరతో జొన్నల కొనుగోలు: డీసీ



జిల్లా అధికారి నితీశ్

రాయచూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) : పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైతుల నుంచి ధాన్యం, తెల్లజొన్న కొనగోళ్లను త్వరలోనే ప్రారంభిస్తున్నట్లు జిల్లాధికారి కే నితీశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం ఎకరాకు 20 నుంచి గరిష్టంగా 150 క్వింటాళ్ల వరకు తెల్లజొన్నలు ఎకరాకు 25 క్వింటాళ్ల నుంచి గరిష్టంగా 50 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరతో ఈ కొనుగోళ్లు వెంటనే ప్రారంభిస్తామన్నారు. రైతులు తమ పేర్లను మే 31వ తేదీ వరకు నమోదు చేసుకునే అవకాశం కల్పించినట్లు జిల్లాధికారి తన ప్రకటనలో వివరించారు.

క్రెడాయ్ అధ్యక్షుడిగా జుయేద్ నోమన్



జుయేద్ నోమన్

బెంగళూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కాన్ఫిడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) బెంగళూరు విభాగం నూతన అధ్యక్షుడిగా జుయేద్ నోమన్‌ను ఎంపిక చేశారు. రియల్‌ఎస్టేట్ రంగంలో అభివృద్ధికి సహకరిస్తున్న ప్రముఖ పారిశ్రామికవేత్త జుయేద్‌కు కీలకమైన పదవి వరించింది. మైసూరుకు చెందిన అమర్ స్థానంలో జుయేద్ రెండేళ్లపాటు కొనసాగనున్నారు. జుయేద్ ప్రిస్టేజ్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా, చైర్మన్ అండ్ ఫౌండర్ డైరెక్టర్‌గాను, కార్పొరేట్ ఫైనాన్స్ విభాగాలలో సేవలందిస్తున్నారు.

అంబేడ్కర్ ఆశయాలు అనుసరణీయం



అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో న్యాయాధికారి మొహ్మద్ రోషన్‌షా

శిడ్లఘట్ట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయాలు, ఆదర్శాలు అందరికీ అనుసరణీయమని కేవలం జయంతికి మాత్రమే స్మరించడానికి పరిమితం కారాదని సీనియర్ సివిల్ న్యాయాధికారి మొహ్మద్ రోషన్‌షా అభిప్రాయపడ్డారు. తాలూకా న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని బుధవారం ఆచరించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం న్యాయాధికారి మాటాడుతూ రాజ్యాంగం ద్వారా అందరికీ ప్రాథమిక హక్కులులు కల్పించిన ఘనత అంబేడ్కర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధాన సివిల్ న్యాయాధికారి పూజా జే, అదనపు సివిల్ న్యాయాధికారి రంజిత, న్యాయవాదుల సంఘం తాలూకా అధ్యక్షుడు ఏ నారాయణస్వామి, కార్యదర్శి సీజీ భాస్కర్, సీనియర్ న్యాయవాది పాపిరెడ్డి, సీడీపీఓ శాఖ అధికారి విద్యావస్త్రద్, కార్మికశాఖ అధికారి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు



నగరమంటే చాలు రోడ్డుపై రోజుకు వేలాది వాహనాలు హల్‌చల్ చేస్తుంటాయి. ఏమాత్రం చిన్న గుంత ఏర్పడినా ప్రమాదాలు చోటు చేసు కుంటాయి. అటువంటిది నిత్యం రద్దీగా ఉండే మహాలక్ష్మి లే అవుట్‌లోని మెయిన్‌రోడ్డులో ఓ గోతి ఏర్పడింది. రోజూవేలాదిమంది ఇబ్బంది పడుతున్నా స్థానిక పాలకులుగానీ బీబీఎంపీ అధికారులుగానీ స్పందించకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

(స్టాఫ్ ఫొటోగ్రాఫర్, బెంగళూరు)

మల్లసంద్రలో రణబేరమ్మ దీపోత్సవం

ముళబాగిలు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మల్లసంద్ర గ్రామంలోని పురాణ ప్రసిద్ధిచెందిన రణబేరమ్మ దేవి పూలపల్లకీ ఉత్సవం, దీపోత్సవం కార్యక్రమంలో వైభవంగా జరిగింది. మూలవిరాట్టుకు పంచా మృతాభిషేకం, విశేష పుష్పాలంకరణ చేశారు. మల్లసంద్ర, కురుడుమలె క్రాస్, దొడ్డగుర్కి గ్రామాలలో అమ్మవారి పూలపల్లకీ ఉత్సవం సాగింది. అర్చకుడు రామణ్ణ నేతృత్వంలో పూజాకైంకర్యాలు జరిగాయి. ముత్తైదు వులు ఉపవాసంతో దీపాలు నెత్తిన మోసుకుంటూ వచ్చి అమ్మవారికి సమర్పించారు. ఆలయాన్ని వివిధ రంగుల పుష్పాలతో అలంకరించారు. సేవాకర్తలచే ప్రసాద వినియోగం, అన్నసంతర్పణ నిర్వహించారు.



అలంకరణలో రణబేరమ్మ అమ్మవారు